క్లుప్తంగా

జ్వరంతో చేర్పిస్తే రూ.2 లక్షల బిల్లు

కేర్ ఆస్పత్రిపై బాధితురాలి బంధువుల ఆరోపణ

మహారాణిపేట: టైఫాయిడ్ జ్వరంతో తన కుమార్తె(వైద్య విద్యార్థిని)ను విశాఖ కేర్ ఆస్పత్రిలో చేర్పిస్తే రూ.2 లక్షల బిల్లు వేసి వేధిస్తున్నారని ఆమె తండ్రి జయరామ్ ఆరోపించారు. దీనిపై గురువారం ఆమె బంధువులు ఆందోళన చేపట్టి.. ఆస్పత్రి వర్గాలతో వాగ్వాదానికి దిగారు. ఆమె తండ్రి తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం రిమ్స్‌లో రేడియాలజీ విభాగంలో టి.స్పందన పీజీ చేస్తున్నారు. ఆమెకు జ్వరం రావడంతో ఈ నెల 26న రామ్‌నగర్‌లోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. నాలుగు రోజుల తర్వాత రూ.2లక్షల బిల్లు వేసి, చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. జ్వరం ఏమాత్రం తగ్గలేదని.. ఇంజక్షన్లు కూడా తెలియని కంపెనీలవి వేశారని అతను ఆరోపించారు. 'వైద్యం చేసిన తర్వాత కొద్ది రోజులకు నయం అవుతుంది. ఆస్పత్రిలో వైద్యం చేసుకోవడం ఇష్టం లేకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. బిల్లు ఇంకా చెల్లించలేదు' అని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

వ్యక్తిపై దాడి

మద్రిపాలెం: రెండు వర్గాల మధ్య వాగ్వాదం వల్ల ఒక వ్యక్తికి గాయాలైన ఘటన కంచరపాలెం పరిధిలో జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం సంజీవయ్య పార్కు దరి వెల్డింగ్ షాపు వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య బుధవారం వాగ్వాదం జరగడంతో పి.శ్రీనివాస్ తలపై కిరణ్ రాడ్డుతో కొట్టాడు. దీంతో శ్రీనివాస్ తలకు, చేతికి గాయాలయ్యాయి. చికిత్స అందించారు. తలపై బలమైన గాయమవడంతో 9 కుట్లు, చేతి మీద 2 కుట్లు పడ్డాయి. శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

అప్పన్న రథ సామర్థ్యం పరిశీలన



రథాన్ని పరిశీలిస్తున్న ఆర్ అండ్ బీ ఈఈ రమేష్‌కుమార్ తదితరులు

సింహాచలం: వచ్చే నెల 2న జరిగే శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించే రథోత్సవానికి సంబంధించి రథం సామర్థ్యాన్ని ఆర్ అండ్ బీ ఇంజినీరింగ్ అధికారులు గురువారం పరిశీలించారు. ఆ రోజు సింహగిరి మాడ వీధుల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని రథాన్ని లాగుతుంటారు. దీనిలో భాగంగా ఏటా రథం సామర్థ్యాన్ని ఆర్ అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి సర్టిఫై చేస్తారు. ఈ తరుణంలో సింహగిరికి వచ్చిన ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యపణేశ్వర్.. రథాన్ని పరిశీలించారు. చక్రాలు, స్టీరింగ్, బొడ్డుబల్ల, తాళ్లు, తదితర వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రథోత్సవంలో పాటించాల్సిన జాగ్రత్తలను దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబుకు తెలియజేశారు.

ప్రజా గాయకుడు దేవిశ్రీకి సత్కారం



మజ్జి దేవిశ్రీని సత్కరిస్తున్న కళాకారులు

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అసోసియేషన్, విశాఖ రత్న కళాపరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 11వ నెల కార్యక్రమాన్ని గురువారం శాంతిపురంలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీని ఘన సన్మానించి డాక్టర్ నందమూరి తారక రామారావు స్మారక పురస్కారం అందజేశారు. ఎన్టీఆర్ పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని, మరింత బాధ్యత పెంచిందని దేవిశ్రీ అన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు పి.ఎ.భాస్కరరావు, సీనియర్ కళాకారులు వర్రి నాంచారయ్య, చింతా ప్రభాకర్, సత్యనారాయణ, మల్లికా, శ్రీకృష్ణ, రామకృష్ణ, సన్‌మూర్తి పాల్గొన్నారు.

అందాల రామయ్య.. సుగుణాల సీతమ్మ..

- అంగరంగ వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం
- తిలకించి తరించిన భక్తజనం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తదితరులు

సీతంపేట: శ్రీరామ నవమి వేడుకలు గురువారం నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిపించారు. రామాలయాలు, అంజనేయ, షిర్డీసాయి మందిరాలు, కాలనీల్లో రామయ్య కల్యాణం నేత్రపర్వంగా సాగింది. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పానకం, వడపప్పు తీర్థప్రసాదాలుగా భక్తులకు పంచిపెట్టారు.

సీతంపేటలో వైభవోపేతంగా..

వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో సీతంపేట పార్వతీశ్వరాలయం వద్ద సీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరిగింది. పట్టుపీతాంబరాలు, ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన సీతారాముల పంచలోహ ఉత్సవ విగ్రహాలకు కల్యాణం కనుల విందుగా సాగింది. పండితుల వేదమంత్రాల మధ్య యజ్ఞోపవీత ధారణ, కంకణధారణ, బాసికం, సుమూహుర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణం తిలకించారు. వారికి పానకం, వడపప్పు, తలంబ్రాలు అందజేశారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ మూర్తులను మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. అన్నమయ్య వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళలు పసుపు కుంకుమ, పండ్లు, పువ్వులు, పలు రకాల మిఠాయిలతో సారె సమర్పించారు.

లలితా పీఠంలో..

అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో వసంత నవరాత్రుల్లో భాగంగా రాములోరి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. సాకేత్ ఆచార్యులు, ఉత్తేజ్ మంత్రోచ్చారణలతో విశ్వక్సేన ఆరాధన, సుదర్శన చక్ర ఆరాధన, అష్ట దిక్పాలకుల ఆరాధన, మంగళ సూత్ర ఆరాధన శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు తలంబ్రాలు, పానకం, వడపప్పు అందించారు. ఈ సందర్భంగా గాయని అక్కిపల్లి లక్ష్మీశైలజ గాత్ర కచేరీ అలరించింది. అనంతరం పీఠంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నందగిరి నగర్‌లో..

జీవీఎంసీ 43వ వార్డు నందగిరి నగర్‌లో శ్రీగోకుల కృష్ణ ఆలయ చైర్మన్ కన్నయ్య ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ భక్తులకు పానకం, వడపప్పు పంచిపెట్టారు. ఆర్.రఘుపతినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్ షిర్డీసాయిబాబా దేవాలయం, గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర, కోదండ రామాలయంలో భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి పూజలు చేశారు. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీగణపతి ఆలయ కమిటీ, శ్రీరామ నవమి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో విశాలమైన తాటాకుల చలువ పందిరిలో ఒంటిమిట్ట రామాలయం పండితుల ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం జరిపారు. స్వామివారికి స్వాతి ప్రమోటర్స్ ఎండీ ఎం.రమేష్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

క్షత్రియ కల్యాణ మండపంలో వేడుకలు

సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో సిరి వెంకటేశ్వర డెవలపర్స్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు దంపతులు, నడింపల్లి శ్రీనివాసరాజు దంపతులు సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. క్షత్రియ సమితి పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

42, 45 వార్డుల్లో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు చాకలిపేట, రైల్వే న్యూకాలనీ, అక్కయ్యపాలెం, జగన్నాథపురం, గవర తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాస్, మానేపల్లి వెంకటేష్, శివ, శ్యామ్, కంచు రమణమూర్తి, బోర శ్రీనివాసరెడ్డి, బొడ్డేటి వెంకటరావు, మొల్లేటి జగన్, సూర్యనారాయణ, పిల్లా గణేష్, లోకేష్, వేణుగోపాల్, రవి, పకీర్‌నాయుడు, అలివేలు, మాలతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

- 45వ వార్డు తాటిచెట్లపాలెం హైవే పక్కన గల కోదండ సీతారామ ఉమా విశ్వేశ్వరాలయంలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తలు ఎం.సూర్యనారాయణ, రాజేశ్వరి, ఎం.సింహాచలం శ్రీనివాసరావు, నూకరత్నం, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, బాబూరావు, సన్యాసప్పలనాయుడు, దుర్గ, మహేష్ పాల్గొన్నారు.

గొల్లకంచరపాలెం ఆలయంలో..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి, సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజేటి రామాచరణాచార్యులు, రాజేటి గంగాధర్ శర్మ ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. పల్లా సత్యనారాయణ, నమ్మి రాజారమేష్ దంపతులు కలశ ప్రతిష్ఠ చేశారు. సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సీతమ్మకు సారె సమర్పణ, పల్లకీ ఊరేగింపు చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కనుల పండువగా..

మురళీనగర్: సీతారాముల కల్యాణోత్సవం మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో కనుల పండువగా జరిగింది. మురళీనగర్ రామాలయంలో శైవాగమ పండితుడు అయిలూరి రఘురామాచార్యులు పర్యవేక్షణలో సంప్రదాయ సిద్ధంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. మురళీనగర్ మహిళలు అమ్మవారి తరఫున సారె సమర్పించారు. శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున కీర్తి పట్నాయక్ ప్రత్యేకంగా సారె అందజేశారు. హార్బర్ ఏసీపీ శిరీష రాములోరిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాలు 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వెయ్యి మందికి సీతారాముల చిత్రపటాలను పంపిణీ చేశారు. సాయంత్రం శ్రీరాముడి పట్టాభిషేకం, దర్బార్ సేవ, పవళింపు సేవ నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీపీ రెడ్డి, సనపల వర ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవుని సన్నిధిలో విశేషంగా ఉత్సవాలు

కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకులు వాసు, శేషు స్వాముల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఉత్సవాలను తిలకించడానికి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- పట్టాభిరెడ్డితోట దాసాంజనేయస్వామి ఆలయం వద్ద ఆరవిల్లి సీతారామాచార్యుల పర్యవేక్షణలో సీతారాముల విగ్రహాలకు కల్యాణం జరిపారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, పార్కు ప్రతినిధులు జి.వెంకటేశ్వరరావు, జి.వి.రత్నం, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్–2 భద్రాద్రి సీతారామ చంద్రస్వామి ఆలయంలో యువసేన సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి, ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా వసంత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారాముల కల్యాణంతోపాటు విశేష పూజా కార్యక్రమాలు వైభవంగా జరిపారు. వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు పేడాడ రమణికుమారి, మెట్ట దమయంతి స్వామివారిని దర్శించుకున్నారు. వీరంతా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

మాధవధార కోదండ రామాలయంలో..

50వ వార్డు మాధవధార కోదండ రామాలయంలో స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ స్వామిని దర్శించుకున్నారు. దాదాపు 100 ఏళ్ల కిందట మాధవధార పూర్వీకులు ఒక పురిపాకలో ఈ ఆలయాన్ని నిర్మించారని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



సీతంపేటలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు



తాటిచెట్లపాలెంలో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు, పైడి రమణ, ధర్మకర్త



మురళీనగర్ రామాలయంలో సీతారాములకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



సీతంపేటలో కనుల పండువగా జరుగుతున్న సీతారాముల కల్యాణం



లలితా పీఠంలో సీతారామ కల్యాణ మహోత్సవం



లలితా పీఠంలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు



వైభవ వేంకటేశ్వరాలయంలో సీతారాములకు తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



గాంధీనగర్-2 ఆలయంలో పూజలందుకున్న సీతారాములు



దాసాంజనేయ స్వామి ఆలయంలో కల్యాణమూర్తులు



51వ వార్డులో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, రమణికుమారి



50వ వార్డులో సీతారాములను దర్శించుకుంటున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్



గొల్లకంచరపాలెంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



మురళీనగర్‌లో సీతమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు



ఆక్సిజన్ టవర్స్‌లో రాములోరికి ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు

పురవీధుల్లో షిర్డీసాయి ఊరేగింపు



సీతమ్మధారలో బాబాను పల్లకీపై ఊరేగిస్తున్న భక్తులు



పల్లకీ వెంట హారతి, క్షీర కలశాలతో నడుస్తున్న భక్తులు

సీతమ్మధార: శ్రీరామ నవమి సందర్భంగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో అత్యంత వైభవంగా సీతారామ కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ఈ వేడుక జరిపారు. సాయంత్రం 4 గంటలకు సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్ పురవీధుల్లో సాయిబాబాను పల్లకీపై ఊరేగించారు. 1008 క్షీర కలశాలతో భక్తులు వెంట నడిచారు. ఊరేగింపులో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, డ్యాన్స్‌లు అలరించాయి. భక్తులు భారీగా పాల్గొన్నారు.

సీతంపేటలో మెగా పోస్టల్ మేళా



మెగా మేళాలో పాల్గొన్న కార్పొరేటర్ గోవింద్, పోస్టల్ సిబ్బంది

సీతంపేట: అక్కయ్యపాలెం సబ్ పోస్టాఫీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద మెగా పోస్టల్ మేళా నిర్వహించారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మేళాను ప్రారంభించి మాట్లాడారు. తపాలా శాఖ అనేక రకాల పొదుపు పథకాలను అందజేస్తోందన్నారు. ఆర్‌డీ, డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి పథకాల్లో ప్రజలు మదుపు చేసి అధిక లాభాలు, మీ డబ్బుకు పూర్తి రక్షణ పొందవచ్చని చెప్పారు. పోస్ట్ మాస్టర్ ఏసు మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో గాని, మీ ఇంటికి ఉత్తరాలు బట్వాడా చేసే పోస్ట్‌మ్యాన్, ఉమెన్ ద్వారా ఇంటి వద్దే డబ్బు చెల్లించి పోస్టల్ పథకాల్లో డిపాజిట్ చేయవచ్చని తెలిపారు. పోస్టల్ శాఖ అందిస్తున్న పలు పొదుపు పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమాన్ని వెస్ట్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షించారు. అక్కయ్యపాలెం సబ్ పోస్టాఫీస్ సిబ్బంది, పోస్ట్‌మ్యాన్‌లు, పోస్ట్ ఉమెన్‌లు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కరోజే రూ.2.72 కోట్ల పన్నుల వసూలు

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీకి నేడే చివరి రోజు



హెచ్‌పీసీఎల్ అధికారుల నుంచి చెక్కు స్వీకరిస్తున్న ఆర్వో శివకుమార్

సీతంపేట: జీవీఎంసీ జోన్-3 పరిధిలో గురువారం ఒక్క రోజే రూ.2.72 కోట్లు పన్నులు వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపు, ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ ఈ నెలాఖరుతో ముగియనుండటంతో గురువారం, శుక్రవారం అన్ని సౌకర్యం కేంద్రాలు తెరిచే ఉంచారు. గురువారం జోన్-3 పరిధిలో 1,024 మంది ఆస్తి పన్నులు చెల్లించడం ద్వారా రూ.2.72 కోట్లు వసూలు అయినట్టు రెవెన్యూ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు. జోన్–3 పరిధిలో 83,509 అసెస్‌మెంట్ల ద్వారా రూ.95.47 కోట్లు పన్ను వసూలు లక్ష్యం కాగా.. ఈ నెల 29 నాటికి రూ.88.05 కోట్లు వసూలు అయినట్టు చెప్పారు. హెచ్‌పీసీఎల్ నుంచి రూ.58.83 లక్షలు చెక్కు రూపంలో అత్యధికంగా వసూలు చేసినట్టు వెల్లడించారు. వడ్డీ మాఫీ అవకాశం పొందడానికి శుక్రవారం చివరి రోజని, ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని జోన్ కార్యాలయాల్లోని సౌకర్యం కేంద్రాలు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచే ఉంటాయని ఆర్వో తెలిపారు.

1న మానవహారం



ధర్నా చేస్తున్న ఆటో సంఘం నాయకులు

సీతంపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏప్రిల్ 1న నగరంలో నిర్వహించనున్న మానవహారంలో కార్మికులు, ప్రజానీకం పాల్గొని బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలంటూ నరసింహనగర్ జాతీయ రహదారి వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న నిరసన దీక్షలకు ఏప్రిల్ 1 నాటికి రెండేళ్లు పూర్తవుతాయన్నారు. ఈ సందర్భంగా ఆరోజున గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ జంక్షన్ వరకు కార్మిక ప్రదర్శన, అనంతరం జరిగే మానవహారంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రావికృష్ణ, ఆటో సంఘం నాయకులు ఎం.నాగరాజు, మజ్జి చంద్రరావు, సిహెచ్.లక్ష్మణరావు, జి.అప్పారావు, కె.రఘు, కె.నర్సింగ్, కె.అప్పలరాజు, కె.దుర్గయ్య, వి.అప్పన్న, డి.భాస్కర్ పాల్గొన్నారు.